
# ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 14 జూన్ 2024
5





| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 27 | 35 |
| భద్రాద్రి | 26.8 | 39.7 |



సీతారామ ఎత్తిపోతల పథకం గురించి మంత్రులకు వివరిస్తున్న తుమ్మల




సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రులు



# 'ఇరిగేషన్' సెక్టార్‌ను నాశనం చేశారు..

- ప్రాజెక్టుల పేరుతో నిధులు దుబారా చేసిన కేసీఆర్ ప్రభుత్వం
- రీడిజైన్ పేరుతో విచ్చల విడిగా ఖర్చు చేశారు..
- సీతారామ ప్రాజెక్టుపై రూ.8 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికీ నీళ్లు ఇవ్వలేదు
- 'సీతారామ'ను పూర్తిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- ఆగస్టు 15 నాటికి లక్షా 20వేల ఎకరాలకు గోదావరి నీళ్లు
- ఏన్కూరు లింక్ కెనాల్‌కు రాజీవ్ కెనాల్‌గా నామకరణం చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల పొంగులేటి, ఉత్తమ్
- సీతారామ, సీతమ్మ సాగర్ పనులను పరిశీలించిన మంత్రుల బృందం

## గత బీఆర్ఎస్ సర్కారు తీరుపై రాష్ట్ర మంత్రుల బృందం ఫైర్



పంప్ హౌజ్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

ఖమ్మం, ఆంధ్రజ్యోతి ప్రతినిధి/ కొత్తగూడెం/ అశ్వాపురం/ ములకలపల్లి, జూన్ 13: సాగునీటి ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా నిధులు ఖర్చుచేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.8వేల కోట్లు ఖర్చుపెట్టి ఒక్క ఎకరానికి కూడా నీరివ్వలేదన్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామను పూర్తిచేసి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తుందని హామీ ఇచ్చారు. వచ్చే ఆగస్టు 15 నాటికి ఏన్కూరు లింక్ కెనాల్ పూర్తిచేసి లక్షా 20వేల ఎకరాలకు గోదావరి నీళ్లను అందిస్తామన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరిపై నిర్మాణంలో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ డ్యామ్‌ను మంత్రుల బృందం గురువారం సందర్శించింది. హెలీకాప్టర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి, కుమ్మరిగూడెం సమీపంలోని ప్రాజెక్టు ప్రదేశానికి చేరారు. అప్పటికే గండుగులపల్లినుంచి వచ్చిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలతో కలిసి మంత్రులు సీతారామ ఎత్తిపోత పథకం, సీతమ్మసాగర్ డ్యాంను పరిశీలించారు. అక్కడ ఉన్న వ్యూపాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అక్కడి నుంచి బీజీ కొత్తూరు వద్ద చేరుకుని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పంపు హౌజ్-1 పంపుహౌజ్ పనులను పరిశీలించారు అనంతరం విద్యుత్ మోటార్లకు సబ్‌స్టేషన్ నుంచి పవర్ సరఫరాను మంత్రులు ప్రారంభించారు. అనంతరం సుమారు 60కి.మీ. పైగా కాలువను మంత్రులు వాహనాల్లో వెళ్లి పరిశీలించారు. తరువాత ములకలపల్లి మండలం పూసుగూడెం పంపు హౌజ్ వద్దకు చేరుకుని ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రాజెక్టు పురోగతిని అధికారులు మంత్రులకు వివరించారు.

సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.... రాజీవ్‌సాగర్ ప్రాజెక్టుకు సీతారామ ప్రాజెక్టుకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించాలని అధికారులను ఆదేశించగా వారిచ్చిన సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు.. రూ.2,654 కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరాసాగర్ ప్రాజెక్టును తక్కువ ఖర్చుతో చేపడితే సీతారామ రీడిజైన్‌తో రూ.20వేల కోట్ల వరకు ఎందుకు పెంచారని మంత్రులు ప్రశ్నించారు. దీనికి అధికారులు ఇచ్చిన సమాధానానికి మంత్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుపై రూ.8వేల కోట్లు ఖర్చుపెట్టినా ఒక్క ఎకరానికీ నీరివ్వలేదని భట్టి విమర్శిమచారు. ఎన్నెస్పీ కెనాల్‌కు సీతారామ కాల్వను లింక్ చేయడానికి 9కి.మీ. ఉన్న ఏన్కూరు లింక్‌కెనాల్‌ను పూర్తి చేయడానికి రూ.72కోట్లు మంజూరు చేశామని వివరించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంపు హౌజ్ 1, 2, 3 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీల పనులు తొందరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో ఇరిగేషన్ సెక్టార్‌ను నాశనం చేశారని విమర్శించారు. ప్రణాళిక లేకుండా అనాలోచితంగా నిధులు ఖర్చుచేసి ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా నీళ్ల

(మిగతా 6వ పేజీలో)

### నిలదీసిన మంత్రులు.. నీళ్లు నమిలిన అధికారులు...

కొత్తగూడెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రుల బృందం అడిగిన ప్రశ్నలకు ఇంజనీరింగ్ అధికారులు జవాబులు చెప్పలేక చేతులెత్తేశారు. అధికారిక సమావేశాలకు ఇలాగేనా వచ్చేది..? అంటూ మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టు సందర్శనలో భాగంగా గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ములకలపల్లి మండలంలోని పూసుగూడెం గ్రామంలో పంపుహౌస్ వద్ద ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో సమీక్ష జరిపారు. ప్రాజెక్టునిర్మాణం పూర్తయితే నీటిని ఎప్పుడు విడుదల చేస్తారు..? ఎన్ని వేల ఎకరాలకు నీటిని అందచేస్తారు..? బిల్లులు ఎ మేరకు చెల్లించారు..? ఇప్పటి వరకు ఎంత ఖర్చయింది..? అంటూ ప్రశ్నలను సంధించారు. దీంతో అధికారులు సరైన రీతిలో సమాధానం ఇవ్వకుండా దాటవేసే ప్రయత్నం చేశారు. దీంతో ఒక దశలో మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్ష చేసేటప్పుడు సమగ్ర నివేదికలతో అధికారులు రావాలని హితవు పలికారు. కాగా, నీటిపారుదల సీఈ పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేస్తున్న సమయంలో మైకు సక్రమంగా పని చేయలేదు. ఆయన చెప్పేది వినకపడక మంత్రులు అసహనం వ్యక్తం చేశారు. మొత్తమ్మీద సమీక్ష సమావేశం అధికారుల డొల్లతనాన్ని బయటపెట్టింది.









## కురిసింది వాన..

- ఖమ్మం జిల్లాలో పలుప్రాంతాల్లో భారీవర్షం
- 5 సెంటి మీటర్లకు పైగా వర్షపాతం నమోదు
- బోనకల్‌లో పిడుగుపాటుకు గీతకార్మికుడి మృతి
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం



మధిరలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 12: ఖమ్మం జిల్లాలోని పలుప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీవర్షం కురిసింది. గాలిదుమారంతో కూడిన భారీవర్షం రావడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. పలుచోట్ల 5 సెంటీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. బోనకల్ మండలంలో పిడుగుపాటుకు గీతకార్మికుడు మృతిచెందాడు. మధిర మండలం సిరిపురంలో పిడుగుపాటుకు రెండు పాడిగేదెలు మృతి చెందాయి. భారీవర్షంతో ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారులు జలమయం కావడంతో భారీగా ట్రాఫిక్‌జాం అయ్యింది. గురువారం ఉదయంనుంచి సాయంత్రం తీవ్రమైన ఎండ కొట్టగా సాయంత్రం 4:30 సమయంలో అకస్మాత్తుగా మబ్బులుపట్టి గాలిదుమారంతో భారీ వర్షం కురిసింది.

బోనకల్‌లో 5.3సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖమ్మంలోని ఖానాపురం హవేలీ, చింతకాని, మధిరలో 5.1సెంటీమీటర్లు, రఘునాథపాలెంలో 4.6సెంటీమీటర్లు, ఖమ్మంలోని ఎన్నెస్పీ గెస్ట్‌హౌజ్ ప్రాంతంలో 4.5సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, తల్లాడ, ముదిగొండ, కామేపల్లి, వైరా ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. బోనకల్ మండలం మోటమర్రిలో పిడుగుపాటుకు చిట్టిమోదు విష్ణు అనే గీత కార్మికుడు మృతిచెందాడు.

గురువారం సాయంత్రం కల్లు తీసేందుకు తాటిచెట్లు ఎక్కేందుకు వెళతుండగా, పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. మధిర మండలం సిరిపురంలో పిడుగుపడి రెండు పాడిగేదెలు మృతిచెందాయి.

## నాడు కళకళ.. నేడు వెలవెల



వెలవెలబోతున్న కూసుమంచి గంగాదేవి చెరువు

- పనిచేయని భక్తరామదాసు ప్రాజెక్టు
- వర్షాభావ పరిస్థితులతో భూములు బీళ్లు
- వరుణుడి కరుణ కోసం ఎదురుచూపులు

కూసుమంచి, జూన్ 13: చాలాకాలం తర్వాత పాలేరు నియోజకవర్గంలో చెరువులు వట్టిపోయాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఏఒక్క చెరువులోనూ నీటివనరులు లేకపోవడంతో నెర్రెలు బారాయి. గత ఏడేళ్లుగా వరుసగా భక్తరామదాసు కారణంగా వేసవిలోనూ కళకళలాడిన చెరువులు.. నేడు నీరు లేక ఎండిపోయ్యాయి. ప్రతిఏటా వర్షాకాలంలో ప్రారంభంలోనే చెరువుల్లో నీరు నిల్వ ఉంటుండటంతో భూగర్భజలాలు అభివృద్ధిచెంది పంటలు సాగుకు సిద్ధమయ్యేవారు. కానీ అందుకు భిన్నంగా ఈఏడాది చెరువులన్నీ వట్టిపోవడంతో రైతులందరూ వరుణుడి కరుణకోసం ఆకాశం వైపు చూడాల్సి వస్తోంది.

పాలేరు నియోజకవర్గంలో కరువుతో అల్లాడుతున్న సమయంలో రైతుల విపత్కర పరిస్థితులను గుర్తించి ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి పట్టుదలతో భక్తరామదాసు ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 2016లో నిర్మితమైన ఈప్రాజెక్టును 2017 జనవరి-30న జాతికి అంకితం చేశారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత తెలంగాణ ప్రభుత్వంలో నిర్మితమైన తొలి ప్రాజెక్టుగా అప్పుడు రికార్డులకు ఎక్కింది. అప్పటినుంచి ఏటా రెండు సీజన్‌లలోనూ పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మంరూరల్, నేలకొండపల్లి మండలాల్లోని సుమారు 30వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా సాగర్ జలాలతో చెరువులను కుంటలను నింపడంతో ధాన్యపు రాశులు పండేవి. చెరువుల్లో పుష్కలంగా నీరు ఉంటుండటంతో రైతులు తమ పంటపొలాలను మాగాణి భూములుగా మార్చారు. ఒకప్పుడు పంటలు సరిగా పండక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు తిరిగి తమ ప్రాంతాలకు వచ్చి వ్యవసాయం చేశారు.

గత ఏడాదివరకు కళకళలాడిన చెరువులు నేడు నీరు లేక వట్టిపోయాయి. గత ఏడాది వర్షాభావపరిస్థితుల కారణంగా పాలేరు జలాశయానికి సాగర్ జలాలు రాకపోవడంతో ప్రాజెక్టు నడపలేదు. అడపాదడపా సాగర్ జలాలు పాలేరు వచ్చినప్పటికీ.. వాటిని తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించారు. దీంతో అటు వర్షాలు లేకపోవడం, ఇటు భక్తరామదాసు ప్రాజెక్టు నడవకపోవడం వల్ల చెరువులన్నీ నీరు లేక ఎండిపోయ్యాయి. నియోజకవర్గంలో సుమారు 30కిపైగా చిన్న మధ్యతరహా చెరువులు ఉన్నాయి. ఇవన్నీ ఏటా భక్తరామదాసు నీటితో నింపేవారు. వాస్తవానికి ఎంతో కొంత అవకాశం ఉన్నా పాలకులు, అధికారులు సరిగా పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఏచెరువులోనూ కనీసం పశువులు తాగేందుకు కూడా నీరు లేనంతగా విపత్కర పరిస్థితి ఏర్పడింది. గత వానాకాలం, యాసంగి పంటలకు సైతం రైతులు ఇబ్బందులు పడ్డారు. వందలాది ఎకరాల సాగుభూమి బీళ్లుగా మిగిలిపోయింది. గడిచిన ఆరేళ్లలో ఇలాంటి పరిస్థితులు ఎదురుకాలేదని రైతాంగం పేర్కొంటున్నారు.

## అర్ధరాత్రి రెండు రైళ్లలో చోరీ

- సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైళ్లకు బ్రేక్ వేసిన దుండగులు
- రైళ్లు ఆగిన వెంటనే మహిళల నుంచి ఆభరణాల అపహరణ

చింతకాని, జూన్ 13: విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న రెండు రైళ్లలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మచిలీపట్నం, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రాత్రి ఖమ్మం జిల్లా చింతకాని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ముందస్తు ప్రణాళిక ప్రకారం సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైలు నిలుపుదల చేసి ప్రయాణికుల వద్ద బంగారు వస్తువులు అపహరించినట్లు సమాచారం. బుధవారం రాత్రి 12.15 నుంచి 1 గంట సమయంలో ఈ చోరీ జరిగింది. తొలుత మచిలీపట్నం రైలు ఆ తరువాత పద్మావతి రైలులో చోరీ జరిగింది. రెడ్ సిగ్నల్ పడగానే డ్రైవర్ రైలును నిలుపుదల చేయడంతో కిటికీ పక్కన కూర్చున్న మహిళల మెడలో ఉన్న బంగారు వస్తువులు దొంగలు అపహరించారు. నాలుగు నుంచి ఐదుగురు వ్యక్తులు ఈ చోరీల్లో పాల్గొన్నారని, రెండు రైళ్లలో సుమారు 15 తులాల వరకు బంగారం చోరీకి గురైనట్లు సమాచారం. బాధిత ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కొందరు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం రైల్వే ఎస్పీ సలీమాతో వైరా ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్, ఎస్ఐ నాగుల్‌మీరాతో పాటు జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసు అధికారులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని విచారణ నిర్వహించారు.

## మధిరకు గిరిజన గురుకులం

- ఉప ముఖ్యమంత్రి భట్టి చొరవ ఫలితం
- స్థలం కోసం పలు భవనాలు పరిశీలించిన ఆర్‌సీవో

మధిర, జూన్ 13: మధిరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మంజూరైంది. ఇక్కడ గిరిజన బాలుర, బాలికల హాస్టళ్లు ఎంతో కాలంగా నడుస్తున్నాయి. రెండు జిల్లాలకు చెందిన గిరిజన విద్యార్థులు అనేక మంది మధిర వచ్చి చదువుకుంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మధిరలో గిరిజన గురుకులం ఏర్పాటుచేయాలని ఎంతోకాలంగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఎట్టకేలకు భట్టి చొరవతో ప్రభుత్వం గిరిజన బాలుర గురుకులం పాఠశాలను మంజూరు చేసింది. ఈ గురుకులం పాఠశాల ఏర్పాటైతే 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు గిరిజన విద్యార్థులు చదువుకొనే సదుపాయం కలుగుతుంది. ప్రభుత్వమే అన్ని సదుపాయాలతో ఉచిత విద్య అందిస్తుంది. ఈ ఏడాది 6వ తరగతిలో 40మంది, 40మంది విద్యార్థులతో రెండు సెక్షన్లుగా ఏర్పాటుచేస్తారు. అయితే ఇంకా పూర్తిస్థాయిలో నిబంధనలు రావాల్సి ఉంది.

కాగా, మధిరలో పాఠశాల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాల రీజియన్ కో ఆర్డినేటర్ వీ వెంకటేశ్వరరాజు గురువారం మధిర వచ్చి పలు భవనాలను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లుతో కలిసి మధిరలోని సుశీల పాత డిగ్రీ కళాశాల భవనం, టాగూర్ స్కూల్ భవనం, గిరిజన బాలుర హాస్టల్ భవనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మధిర తహసీల్దార్ వెంకటేశ్వర్లు, గిరిగిజ సంక్షేమ శాఖ అధికారులు కె నరేంద్ర, గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కామాంధుడికి 20 ఏళ్ల జైలు

- ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం కేసులో తీర్పు

ఖమ్మం లీగల్, జూన్ 13: బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి ఖమ్మం జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి 20సంవత్సరాలు జైలు, రూ.55వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. గత ఏడాది మార్చి 5న ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని గ్రామంలో ఇంటిముందు బజారులో ఆడుకుంటున్న చిన్నారి(6)ని అదే గ్రామానికి చెందిన నిందితుడు కాంపాటి కార్తీక్(20) మాయ మాటలు చెప్పి ఆటోలో ఆటోలో ఎక్కించుకొని తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై బాలిక తండ్రి రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో పోలీసులు నిందితుడిపై కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన ఖమ్మం జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి కె.ఉమాదేవి నిందితుడిపై నేరం రుజువు కావటంతో 20 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.55 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శంకర్ వాదించగా, కోర్టు కానిస్టేబుల్ జి.రవికిషోర్, కోర్టులైజనింగ్ అధికారులు కె.శ్రీనివాసరావు, మోహన్‌రావు, హోంగార్డు ఆయూబ్ సహకరించారు.

## బడిబాట, పిల్లల వేట


పిల్లలను పాఠశాలకు బైక్‌పై చేరవేస్తున్న ఉపాధ్యాయుడు

కల్లూరు, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే క్రమంలో విద్యాశాఖ చేపట్టిన బాడి బాట కార్యక్రమాన్ని గురువారం ఓ ఉపాధ్యాయుడు వినూత్నం గా ప్రచారం చేపట్టారు. ఆ క్రమంలో కల్లూరు మండలం లోని చెన్నూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన దంతాల సుధాకర్ గత వారం రోజుల నుంచి మండలం లోని పలు గ్రామాల్లో తన సొంత ఖర్చులతో బాడిబాట కార్యక్రమంపై పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా ప్రచారం చేస్తూ బడీఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు. తాను పనిచేస్తున్న చెన్నూరు పాఠశాల పరిధిలోని పిల్లల ఇంటి వద్దకు వెళ్లి వారిని వెంట బెట్టుకొని పాఠశాల ప్రారంభ సమయానికి ముందుగా బాడిబాట బైక్‌పై చేరవేస్తున్నారు. తన విధి నిర్వహణలో రోజు వారిగా పాఠశాలలకు వెళ్తున్న క్రమంలో సుధాకర్ తన బైక్‌పై పిల్లలను పాఠశాలకు చేరదీయటం అభినందనీయం.

### ఓపెన్ పది, ఇంటర్ ఫలితాలు విడుదల

ఖమ్మం, ఖానాపురంహవేలి జూన్ 13: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏప్రిల్ మేలో నిర్వహించిన ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను సార్వత్రిక విద్యాపీఠం గురువారం విడుదల చేసిందని డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. పదోతరగతిలో 863 మందికి 349 మంది, ఇంటర్‌లో 1031 మందికి 462 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అభ్యర్థులకు రీకౌంటింగ్, లేదా రీవెరిఫికేషన్ కావాలంటేఈ నెల 18 నుంచి 27వ తేదిలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పదోత రగతికి రీ కౌంటింగ్‌కు రూ.350, రీ వెరిఫికేషన్‌కు రూ.1200 ఒక్కో సబ్జెక్టుకు, ఇంటర్‌కు రీ కౌంటింగ్‌కు రూ.400, రీవెరిఫికేషన్‌కు రూ. 1200 చొప్పును ఫీజు చెల్లిం చాల్సి ఉంటుందని తెలిపారు.

## ఇరిగేషన్ సెక్టార్‌ను నాశనం చేశారు..

(5వ పేజీ తరువాయి)

విడుదల చేయకుండా అదనపు ఆయకట్టు లేకుండా దుబారా చేశారన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కేసీఆర్ కోలుకోలేని విధంగా దెబ్బతీశారని, ప్రాజెక్టుల పేరుతో నిధులు దుబరా చేశారని ఆరోపించారు. సీతారామ కింద 52 కి.మీ. కాలువ నిర్మించినా ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదన్నారు. తాము వచ్చే ఆగస్టు 15 నాటికి ఏన్కూరు లింక్ కెనాల్‌ను పూర్తిచేసి ఎన్నెస్పీ ఆయకట్టుకు నీరందించేందుకు రూ.70కోట్లతో పనులు చేపట్టామన్నారు. ఈ కాల్వకు రాజీవ్ కెనాల్‌గా నామకరణం చేస్తూ అసెంబ్లీలో ప్రతిపాదన పెడతామన్నారు. అలాగే పాలేరు లింక్‌కెనాల్‌కు జూలూరుపాడు వద్ద టన్నెల్ నిర్మించేందుకు అవసరమైన నిధులు కూడా మంజూరు చేస్తామని ప్రకటించారు. సీతారామ ప్రధాన కాలవ వెంట కొత్తగూడెం, పినపాక, భద్రాచలం నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పూర్తికావడానికి నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్ కేంద్ర పర్యావరణ శాఖలో ఉన్న స్టేలను తొలిగించి పనులు పూర్తి చేయడానికి కృషిచేస్తామన్నారు. సీతారామ లిఫ్టు ఇరిగేషన్ కెనాల్ మరమ్మతులకు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు మేలు జరిగేలా జిల్లాలోని భారీ, మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి కష్టమైనా, భారమైన, సీతారామ ప్రాజెక్టును పూర్తిచేసి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 1997లో దుమ్ముగూడెం ప్రాజెక్టుగా దీనికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత రాజశేఖరరెడ్డి ప్రభుత్వం రాజీవ్, ఇందిరసాగర్ రెండు లిఫ్టులుగా ప్రతిపాదించి కొంత పనులు పూర్తి చేసిందని, ఆ తర్వాత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 'సీతారామ'గా పేరుమార్చి రీడిజైన్ చేసిందన్నారు. ప్రస్తుతం లింక్‌కెనాల్ హెడ్‌వర్క్, ఎత్తిపోతల పనులు పూర్తయ్యాయని, అయితే కొంత భూసేకరణతో పాటు జూలూరుపాడు, పాలేరు లింక్‌కెనాల్‌కు సంబంధించి రెండు టన్నెల్స్ నిర్మించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు నిధుల అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు లంకసాగర్‌కు నీళ్లు తీసుకెళ్లడం ద్వారా సాగర్ ఆయకట్టు కొంత స్థిరీకరణ అవుతుందన్నారు. మొత్తం 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో సీతారామ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన నిర్లక్ష్యం, సమన్వయ లోపంతో ప్రాజెక్టు డిజైన్ మారడంతో కొంత నష్టం జరిగిందన్నారు. తమ ప్రభుత్వానికి భారమైనా, నష్టమైనా ఈ ప్రాజెక్టును పూర్తిచేసి తీరుతామన్నారు. ప్రస్తుతం 3లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టుకు సీతారామతో నీరందుతుందన్నారు. అలాగే సీతారామ కెనాల్ వెంట డిస్ట్రిబ్యూషన్ కెనాల్ పనులు చేపట్టి ఇతర నియోజకవర్గాలకు కూడా సాగునీరందించాల్సి ఉందన్నారు. మొత్తంగా 3లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టుతో పాటు మరో 7 లక్షల ఎకరాల ఇతర ఆయకట్టుకు నీరందేలా సీతారామ ప్రాజెక్టును డిజైన్ చేసినట్లు తెలిపారు.

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అధిక వడ్డీలతో అప్పులు తెచ్చి సాగునీటి ప్రాజెక్టుల పేరుతో దోపిడీ చేసిందని ఆరోపించారు. రూ.8వేల కోట్లు ఖర్చుపెట్టినా ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వకపోవడం బాధకరమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇలాంటి దుబారా లేకుండా సాగునీరందిస్తామన్నారు. ప్రస్తుతం నిర్మించిన కెనాల్స్‌లో కూడా కొన్నిచోట్ల గండ్లు పడ్డాయని, పూడిక ఉందని, దానిని తొలిగించాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో రాజీవ్, ఇందిర సాగర్ ప్రాజెక్టులను రూ.2,600కోట్లతో ప్రారంభిస్తే గత కేసీఆర్ ప్రభుత్వం రూ.20వేల కోట్లతో రీడిజైన్ చేసిందని ఆరోపించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో ఆయకట్టు పెంచేలా సీతారామ రీడిజైన్ చేయాలని సూచించారు.

అనంతరం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెలీకాప్టర్‌లో హైదరాబాదు వెళ్లగా డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల ఏన్కూరు మండలంలోని లింక్‌కెనాల్ పనులు పరిశీలించారు. మంత్రుల పర్యటనలో ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకటరావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, రాందాస్‌నాయక్, రాగమయి, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు, వీపీ గౌతమ్ ప్రియాంక, ఇరిగేషన్ సీఈలు శ్రీనివాసరెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## సీతారామ వల్ల జిల్లాకు
## అన్యాయం జరుగకుండా చూడండి

» కొత్తగూడెం నియోకవర్గానికి ఆయకట్టును కల్పించండి » మంత్రులను కోరిన ఎమ్మెల్యే కూనంనేని


సీతారామా ప్రాజెక్టుపై సమీక్షలో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు నిర్మాణం రీ డిజైన్ మార్చడం వల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అన్యాయం జరిగిందని జిల్లాకు అన్యాయం చేయకుండ రైతులందరికి న్యాయం జరిగేలా చూడాలని జిల్లాకు వచ్చిన నలుగురు మంత్రులకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. సీతారామ ప్రాజెక్టు వల్ల కొత్తగూడెం నియోకవర్గానికి ముఖ్యంగా అన్యాయం జరుగుతుందని ఈ నియోజకవర్గంలో ఆయకట్టుపెంచాలని మంత్రులను కోరారు. గురువారం భద్రాద్రి జిల్లాలోని అశ్వాపురం, ములకలపల్లి మండలాల్లో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు కాల్వలను పంపుహౌస్‌లను పరిశీలనకు వచ్చిన డిప్యూడి సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖామంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి, వ్యవసాయశా ఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖమంత్రి శ్రీనివాసరెడ్డిలకు ఎమ్మెల్యే కూనంనేని విజ్ఞప్తి చేశారు. ములకలపల్లి మండలంలోని పూసుగూడెం గ్రామంలో సీతారామ ప్రాజక్టు పంపుహౌస్ వద్ద నీటిపారుదలశాఖ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మొదటగా ఇల్లెందు ప్రాంతంలోని రోళ్లపాడు వద్ద సీతారామ ప్రాజెక్టుకు ముందుగా శంకుస్థాపన చేసిన డిజైన్ వల్ల జిల్లాకు అన్ని రకాల ఉపయోగం ఉంటుందని ఆ తర్వాత చేపట్టిన రీ డిజైనింగ్ మూలంగా కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లోని రైతుల పంట భూములకు ప్రాజెక్టు నీరు సరపరా కాదని దాని వల్ల రైతులు ఇబ్బందులు పడుతారని కూడా తెలిపారు. ముఖ్యంగా నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి జోక్యం చేసుకుని ప్రాజెక్టుకు రీ సర్వే చేయించి నియోజకవరాల్లో ఆయకట్టును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కూడా ఎమ్మెల్యే కూనంనేని కోరారు. జిల్లాలోని గిరిజన రైతాంగ భూములు సస్యశ్యామలం కావాలంటే సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరు తప్పని సరిగా అయా ప్రాంతాలకు కావాలన్నారు. దీంతో స్పందించిన మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో ఆయకట్టును పెంచేందుకు నీటిపారుదల ఇంజనీరింగ్ అధికారులతో సమగ్రంగా నివేదికలు తెప్పించి ఆయకట్టును పెంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయకట్టు ద్వారా అయా నియోజకవర్గాల్లో చెరువుల్లో నీటిని సరపరా చేసేందుకు కూడా అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే కూనంనేని మంత్రులకు కృతజ్ఞతలు తలిపారు.

## అమెర్దా హెడ్‌రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పూజలు

» సీతమ్మసాగర్, సీతారామాప్రాజెక్ట్‌లను సందర్శించిన మంత్రుల బృందం
» బీజీ కొత్తూరు పంప్‌హౌస్‌కు విద్యుత్ సరఫరాను ప్రారంభం

అశ్వాపురం జూన్ 13: మండల పరిధిలోని కుమ్మరిగూడెం దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ప్రభుత్వం నిర్మిస్తున్న సీతమ్మసాగర్‌బ్యారేజీ, సీతారామలిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లను గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా వ్యూపాయింట్ ద్వారా ప్రాజెక్ట్‌లను పరిశీలించారు. ఆనకట్ట వద్ద అధికారులు మ్యాపుల ద్వారా మంత్రులకు ప్రాజెక్ట్‌ల పురోగతిపనులను వివరించారు. జరుగుతున్న పనులు, సీతమ్మబ్యారేజి పనుల పునఃరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను మంత్రులు అధికారులను అడిగితెలుసుకున్నారు. అనంతరం అమెర్దా వద్ద సీతారామా హెడ్‌రెగ్యులేటర్‌నిర్మాణం వద్ద ప్రత్యేక పూజలు జరిపి గ్రావిటీ కెనాల్ మార్గంలో బిజి కొత్తూరు వద్ద నిర్మించిన సీతారామా మొదటిదశ పంప్‌హౌస్‌ను సందర్శించి మోటార్ల పనితీరును అధికారులను అడిగితెలుసుకున్నారు. పంప్‌హౌస్‌కు విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లోనే ఉమ్మడిజిల్లాకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, రాందాస్‌నాయక్, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంకఅలా, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ వెంకటేశ్వరరెడ్డి, డీఈ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత తదితరులు పాల్గొన్నారు.



అమెర్దా హెడ్‌రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రులు, బీజీ కొత్తూరు పంప్‌హౌస్‌కు విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

## మాకు న్యాయం చేయండి..

» మంత్రుల కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేసిన రైతులు » అడ్డుకున్న పోలీసులు


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ములకలపల్లి జూన్ 13: మండల పరిధిలోని ఒడ్డు రామవరం వద్ద సీతారామ ప్రాజెక్టు వద్ద నిర్వహించే సమీక్ష సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తున్న మంత్రుల కాన్వాయిని ప్రాజెక్టు గేటు వద్ద కొందరు గిరిజనులు రైతులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అక్కడే ఉన్న పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడ్డు రామవరం గ్రామానికి చెందిన కొందరు రైతులకు చెందిన భూములు కాల్వ నిర్మాణంలో పోయియి. ఇప్పటి వరకు వారికి పరిహారం అందలేదని వాపోయారు. అదేవిదంగా మరికొంతమంది రైతులు తమకు పోడు పట్టాలు రాలేదని స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని అటవీశాఖాధికారులు కేసులు పెడుతున్నారని, గతిలేని పరిస్థితితో ఆందోళనకు దిగామన్నారు. విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రైతులను పిలిపించి వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో రైతులు దారావత్ సోమ్లా, దారవత్ శంకర్, సోమ్లా, బానోత్ రాంబాబు, దారవత్ వీరన్న, నారాయణ, యాకూబ్, ఆది నారాయణ బోజ్యా, భద్రు, బుజ్జి, మల్లేష్, రాంచంద్రు, చందర్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి కమ్మసంఘం అభినందనలు


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కమ్మసంఘం సభ్యులు

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 9: కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రజా ప్రభుత్వానికి గురువారం కమ్మ సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ కమిటి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. కమ్మ సమఖ్యకు కేటాయించిన మాదాపూర్‌లోని ఖానామెట్టు ప్రాంతంలోని ఐదు ఎకరాల స్థలం వివాదంలో ఉందని ఆ సమస్య పరిష్కారానికి చొరవతీసుకోవాలని కోరారు. తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకు భారతరత్న అందించాలని కోరగా ముఖ్యమంత్రి స్పందించి కేంద్ర ప్రభుత్వానికి లేఖ అందింస్తామని, స్థల వివాదంకూడ త్వరలో పరిష్కరించి సంఘానికి అందిస్తామని తెలిపినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. కమ్మ వారికి ప్రభుత్వ నామినేటెడ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన ప్రాదాన్యత కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో సంఘం రాష్ట్ర కోశాధికారి కండెపనేని రత్నాకర్, ఆర్గనేషన్ సెక్రటరి సంపత్‌కుమార్, బిక్కసాని నాగేశ్వరరావు, యలమద్ది కిశోర్‌కుమార్, జిల్లా కోశాధికారి నల్లమోతు రఘు, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం డీసీసీబీ పాలకవర్గ సమావేశంలో రగడ

● తమ డిమాండ్లను అజెండాలో చేర్చలేదని సభ్యుల నిరసన


సమావేశంలో నుంచి బయటికి వచ్చిన పాలకమండలి సభ్యులు

ఖమ్మం వ్యవసాయం, జూన్ 13: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గురువారం నిర్వహించిన పాలకవర్గ సమావేశం రసాభాసగ మారింది. నూతన చైర్మన్ బాధ్యతలు చేపట్టిన తరువాత మూడోసారి నిర్వహించిన ఈ సమావేశంలో సభ్యులు తమ డిమాండ్లను అజెండాలో చేర్చలేదని నిరసన తెలిపారు. ఈ కారణంతో సమావేశానికి హాజరైన సభ్యులు నిరసనగా సమావేశం నుంచి వెళ్లిపోయారు. సభ్యులు చేసిన డిమాండ్లలో ప్రధానంగా ఎన్నికల కోడ్ సమయంలో బ్యాంకు పరిధిలో జరిగిన బదిలీల విషయంలో సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడం, లక్షలాది రూపాయలను అలవెన్స్‌లుగా ఇవ్వడం, బ్యాంకు లావాదేవీలపై నాబార్డుకు నివేదిక సమర్పించకపోవడం, నాలుగు డైరెక్టర్ పదవుల ఎన్నిక విషయం, ఏకపక్షంగా రూ.75లక్షల ఇంక్రిమెంట్లను చెల్లించడం వంటి అంశాలను సభ్యులు అజెండాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు డీసీసీబీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించిన అంశాన్ని కూడా అజెండాలో పెట్టకపోవడంపై సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సభ్యుల డిమాండ్లను వచ్చే పాలకవర్గ సమావేశ అజెండాలో పెడతామని పేర్కొన్నారు. దాంతో గురువారం జరిగిన సమావేశంలో ఏ తీర్మానాలను ఆమోదించకుండానే సభ్యులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా కొందరు సభ్యులు గెస్ట్‌హౌస్‌కు తాళం వేయడంతో ఉద్రిక్తత నెలకొంది. కాసేపటికి తాళం తీయడంతో సద్దుమణిగింది.

## న్యాయసేవాసంస్థలో నియామకాలు పూర్తి

ఖమ్మం లీగల్ జూన్ 13: ఖమ్మం జిల్లా న్యాయసేవాధికా రసంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంలో వివిధ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీకి నిర్వ హించిన పరీక్షలు పూర్తయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ అధ్యక్షతన మొదటి అదనపు జిల్లా న్యాయాధికా రి కె.ఉమాదేవి, ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.వి.చంద్రశేఖర్‌రావు లతో కూడిన కమిటీ అభ్యర్థులకి నైపుణ్యత్వ పరీక్షలు నిర్వహించి తదనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పారదర్శకంగా నిర్వహించిన జిల్లా ప్రధానన్యా యమూర్తి జి.రాజగోపాల్ ఏ రోజుకి ఆరోజే ఫలితాలు ప్రకటించి నియామక ఉత్తర్వులు అభ్యర్థులకు అందజేశారు. ఆఫీస్ క్లర్క్ గా జి.రాజ్‌కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా కె.పద్మజ, ఆఫీస్ సబార్డినేటర్ గా సీహెచ్ రమేష్ లకు నియామక పత్రాలు అందజేశారు.

## చేపల పెంపకం లాభదాయకం

● సాంప్రదాయ పంటలతో పాటు చేపల పెంపకం చేపట్టాలి
● పాలేరు మత్స్యపరిశోధనాసానం శాస్త్రవేత్త డాక్టర్ శ్యామ్‌ప్రసాద్

కూసుమంచి, జూన్ 13: చేపల పెంపకం ద్వారా రైతులు అధిక లాభాలు గడించవచ్చని పాలేరు మత్స్యపరిశోధనాకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థికసాయంతో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన 25 మంది ఔత్సాహిక మత్స్యకారులకు 'రీ సర్క్యులేటరీ అక్వాకల్చర్ సిస్టమ్స్- అధునాతన సాంకేతిక పరిజ్ఞానం' అంశంపై శిక్షణలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతు నీటి ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో జలసంపద పెరిగిందన్నారు. రైతులు, మత్స్యకారులు చేపల పెంపకంపై ఆసక్తి కనబర్చాలని పిలుపునిచ్చారు. సాంప్రదాయ పంటలతో పాటు చేపల పెంపకంతో అధిక లాభాలు గడించవచ్చని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో చేపలకు మంచి గిరాకీ ఉందన్నారు. కృత్రిమ హార్మోన్ ఇంజక్షన్ ద్వారా చేప పిల్లలను ఉత్పత్తి విధానంపై వివరించారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్, పాలేరు మత్స్యశాస్త్రవేత్త రవీందర్, మామునూరు కృషి విజ్ఞానకేంద్రం సైంటిస్ట్ డాక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నామమాత్రంగా మారిన జడ్పీలు

● నిధుల లేమితో జరగని అభివృద్ధి పనులు
● జిల్లాల పునర్విభజనతో కుంచించుకుపోయిన పరిధి
● నేడు ఖమ్మం జడ్పీ సర్వస భ్య సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 13: ఒకప్పుడు నిధులతో తులతూగి ఎన్నో అభివృద్ధి పనులకు ఆలవాలంగా నిలిచిన జడ్పీ పాలకవర్గాలు.. నేడు నామమాత్రంగా మిగిలాయి. నిధుల కేటాయింపుల్లో కోతతో నీరసించిపోయాయి. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. దీంతో అభివృద్ధి కార్యక్రమాలు అనుకున్నంతగా జరగలేదు. సభ్యులు ప్రతీ సమావేశంలో అసంతృప్తిని వ్యక్తం చేస్తూనే వస్తున్నారు. జిల్లాల పునర్విభజన ఫలితంగా ఖమ్మం జిల్లా పరిషత్ తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది. పాలకవర్గంలో ముగ్గురు సభ్యులు తప్ప మొత్తం బీఆర్ఎస్ చెందిన సభ్యులే ఉండడంతో సమస్యలపై చర్చలు సాదాసీదాగా జరిగాయి. ఇప్పటి వరకు 21 జడ్పీ సమావేశాలు జరిగాయి. వీటిలో సాధారణంగా 15 తీర్మానాలు చేయగా, నాలుగు ప్రత్యేక తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదించారు.

65 ఏళ్లక్రితం ఏర్పడిన ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ 2019 ఆగస్టు 6న నాలుగు జడ్పీలుగా చీలిపోయింది. ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లా పరిషత్‌లుగా (ఖమ్మం జిల్లాలోని మండలాలతో ) ఆవిర్భవించాయి. ఈ నాలుగు జిల్లాల్లో జడ్పీలకు కొత్తపాలన ఆగస్టు 7 నుంచి ఆరంభం అయ్యింది. 41 మండలాలతో ఉన్న ఖమ్మం జిల్లా పరిషత్ నాలుగుగా చీలిపోయింది. ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లా జడ్పీలుగా ఏర్పాటు కాగా, ఖమ్మం జిల్లాలోని గార్ల, బయ్యారం మండలాలు మహబూబాబాద్ జడ్పీలోనూ, వాజేడు,వెంకటాపురం మండలాలు ములుగు జడ్పీలో కలిసాయి.



ఖమ్మం జడ్పీ కార్యాలయం

ఖమ్మం జిల్లాలో 20, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21 మండలాలతో జిల్లా పరిషత్‌లు ఏర్పాటయ్యాయి. అప్పట్లో ఖమ్మంకు 28, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 24 మంది సిబ్బందిని కేటాయిస్తూ సర్వీటు ఆర్డర్లను అప్పటి క జిల్లా కలెక్టర్ ఆర్వీకర్ణన్ జారీ చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతనంగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లుగా ప్రమాణస్వీకారాన్ని ఇరు జిల్లా పరిషత్ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఖమ్మం జడ్పీ అధ్యక్షుడిగా లింగాల కమల్‌రాజ్, భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ అధ్యక్షునిగా కోరం కనకయ్య ప్రమాణస్వీకారం చేశారు.

ఖమ్మం జిల్లాలో ఈ ఐదేళ్లలో 21 జడ్పీ సమావేశాలను నిర్వహించారు. అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పలుమార్లు జడ్పీ సమావేశాలకు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా హాజరయ్యారు. 20 మంది సభ్యుల్లో ముగ్గురు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులు ఉండడంతో సమావేశాల్లో అనుకున్నంతగా చర్చలు జరగలేదని, నాటి అధికారపార్టీకి అనుకూలంగానే జరిగాయని సభ్యులు భావించారు. ఇక ధాన్యం కొనుగోళ్ల చేపట్టాలని కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా, వజ్రోత్సవ వేడుకల్లో అమరులకు సముచిత న్యాయాన్ని కల్పించాలని, వివిధ పాఠశాలల్లో రేషనలైజేషన్ ద్వారా స్కూల్స్ రద్దు చేయాలనుకున్న ప్రభుత్వానికి వాటిని రద్దు చేయొద్దని తీర్మానాలు చేశారు.

### నేడు జడ్పీ సమావేశం

ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు సీఈవో వినోద్ తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చ జరుగుతుందని, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. కాగా, జడ్పీ పాలకవర్గం పదవీకాలం వచ్చే ఆగస్టు 6తో ముగియనుండటంతో ప్రస్తుతం జరిగే సర్వసభ్య సమావేశమే చివరిది కానుందని భావిస్తున్నారు.

## జమలాపురం ఆలయ అభివృద్ధికి సహకరించండి

» ఎన్టీఆర్ జిల్లా ఎమ్మెల్యేలను కలిసిన కేఎస్ఆర్ అండ్ వీఎస్‌కే ఫౌండేషన్స్ చైర్మన్లు కోటేశ్వరరావు, సాయికుమార్

ఎర్రుపాలెం జూన్ 13: ఎర్రుపాలెం మండలంలో జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఎమ్మెల్యేలను కేఎస్ఆర్ అండ్ వీఎస్‌కే ఫౌండేషన్స్ చైర్మన్లు తుళ్లూరి కోటేశ్వరరావు, వేజండ్ల సాయికుమార్ గురువారం వారిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, మైలవరం ఎమ్మెల్యేలు శ్రీరాంతాతయ్య, వసంత కృష్ణప్రసాద్‌ల ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛంతో పాటు జమలాపురం శ్రీవారి ప్రసాదాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన జమలాపురం శ్రీవారి ఆలయానికి ఎక్కువశాతం ఆంధ్రప్రాంత ప్రజలే శ్రీవారి దర్శనానికి వస్తారని ఎమ్మెల్యేలకు వివరించారు. ఈ ఆలయానికి ఆంధ్రా ప్రాంత ప్రజలకు ఎనలేని అనుబంధముందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఆ అనుబంధం కొనసాగుతూనే ఉందని తెలిపారు. ఆంధ్రా ప్రాంతం నుంచి ప్రస్తుతం రవాణాసౌకర్యం సరిగ్గా లేదని, రహదారులు, బస్ సౌకర్యాలను పెంచితే ఆలయ అభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు. ప్రధాన రహదారుల నుంచి రహదారులను కలిపే రోడ్లుకూడా పునరుద్దరణ పనులు జరిగితే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. ఎర్రుపాలెం, మధిర మండలాల చుట్టుప్రక్కల గల ఎన్టీఆర్ జిల్లా నలువైపులా రహదారుల ద్వారా ప్రయాణం సౌఖ్యంగా ఉంటే ఆలయానికి భక్తుల రాకపోకలు ఎక్కువగా జరుగుతాయన్నారు. జమలాపురం ఆలయానికి వచ్చి శ్రీవారి దర్శనంచేసుకొని ఆశీర్వాదం పొందాలని కోరినట్లు వారు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం తప్పకుండా ప్రాంతీయబేదం లేకుండా ఆలయ అభివృద్ధికి తోడ్పడుతుం దని, నూతన ప్రభుత్వం నుంచి కావాల్సిన అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేసి తమకు అందజేయాలని ఎమ్మెల్యేలు సూచించినట్లు వారు తెలిపారు.


మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

# క్రైం సమాచారం

## ప్రమాదవశాత్తూ బావిలో పడి రైతు మృతి


హన్మంతు మృతదేహం

ముదిగొండ, జూన్ 13: ప్రమాదవశాత్తూ బావిలో పడి రైతు మృతి చెందిన సంఘటన ముదిగొండ మండలం చిరుమర్రిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకా రం.. గ్రామానికి చెందిన గాలి హన్మంతు(38)అనే రైతు తన పొలంలో పనులకు వెళ్లి మంచి నీటి కోసం బావిలోకి దిగాడు. ఆసమయంలో ఫిడ్స్ రావడంతో నీటిలో మునిగి మృతి చెం దాడు. పక్క పొలంలోని రైతులు గమనించి బావిలో నుంచి అతడిని బయటకు తీయగా, అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు..

అశ్వారావుపేట రూరల్, జూన్ 13: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రలోని వేలేరుపాడు సమీపంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఆరే శ్రీనివాసరావు(52) పని నిమిత్తం బయటకు వెళ్లి వస్తుండగా వినాయకపురం, నారాయణపురం గ్రామాల మధ్య ప్రమాదానికి గురై రోడ్డుపై పడిపోయాడు. చాలా సేపటి తర్వాత అటుగా వెళుతున్న వ్యక్తులు తీవ్రగాయాలతో పడి ఉన్న అతడిని గమనించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జంగారెడ్డిగూడెం తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. అశ్వారావుపేటలో గురువారం పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తన స్నేహితుడు శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చింతకాని, జూన్ 13: ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగులవంచ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతర్లపాడు గ్రామానికి చెందిన ఉప్పల నరేందర్ (23) అతని సోదరుడు లోకేష్‌లు ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, నాగులవంచ సమీపంలో గేదెను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి గోతిలో పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన నరేందర్‌ను ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. లోకేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

## అనారోగ్యంతో ఒకరు..

మణుగూరుటౌన్, జూన్ 13: మణుగూరు పట్టణంలో చెన్నుపాటి ట్రాన్స్‌పోర్టు నిర్వాహకునిగా పేరుగాంచిన చెన్నుపాటి హరిప్రసాద్(56) అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం సుందరయ్యనగర్‌లోని ఆయన నివాసంలో మృతదేహానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో వెంకటప్పయ్య, కూచిపూడి బాబు, తిరుమలేష్, బాబ్‌జానీ, ఆర్కే, కుడుతిపూడి కోటేశ్వరరావు, అయోధ్య, దుర్గ్యాల సుధాకర్, వాసిరెడ్డి చలపతి తదితరులు ఉన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని 12 గేదెలు..

తిరుమలాయపాలెం, జూన్13: గుర్తు తెలియని వాహనం ఢీకొని12 గేదెలు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. దమ్మాయిగూడెం, తెట్టలపాడ గ్రామాలకు చెందిన పలువురు రైతులకు చెందిన గేదెలు బుధవారం మేతకు వెళ్లాయి. అర్ధరాత్రి సమయంలో గేదెలు రోడ్డు దాటుతుండగా దమ్మాయిగూడెం సమీపంలో రహదారిపై గుర్తు తెలియని వాహనం వాటిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే సుమారు 12 గేదెలు మృతి చెందాయి.

## ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్లు చోరీ

జూలూరుపాడు, జూన్ 13: రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పార్మర్లలో గుర్తు తెలియని వ్యక్తులు కాపర్‌వైర్లు చోరీ చేసిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం. జూలూరుపాడుకు చెందిన రైతు సిరిపురపు పుల్లారావు పొలంలో, అదే విధంగా మొద్దులగూడెం గ్రామంలో మరో రైతు పొలంలో ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌పార్మర్ల మూతలు తీసి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.60 వేలు విలువ చేసే కాపర్ వైర్లను ఎత్తుకు వెళ్లినట్లు తెలిపారు. ట్రాన్స్‌పార్మర్లు పనిచేయకపోవడంతో రైతులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారాన్ని అందించారు. దీంతో సంబంధిత ట్రాన్స్‌కో సిబ్బంది ట్రాన్స్‌పార్మర్ల వద్దకు వచ్చి మరమ్మతులను చేపడుతుండగా కాపర్ వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. రైతులు ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## 20 లీటర్ల నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం, జూన్ 13: నాటుసారాను తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు ఎక్సైజ్ పోలీసులకు గురువారం పట్టుబడ్డారు. ఎక్సైజ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేగుంట గ్రామానికి చెందిన పాయం నరసింహారావు, కల్లూరు నాగేశ్వరరావులు ద్విచక్రవాహనంపై ఇరవై లీటర్ల నాటుసారాను తరలిస్తూ లచ్చిగూడెం వద్ద రూట్ వాచ్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రహీమున్నీసాబేగం తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు సీతారామరాజు, సాయిరాం, సిబ్బంది హలీం ఖాన్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా రేగుంట, చిననల్లబల్లి, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన నలుగురు సారా విక్రేతలను మండల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

## 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ..

దుమ్ముగూడెం, జూన్ 13: చిననల్లబల్లి వద్ద గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఏపీ రాష్ట్రం కూనవరం మండలం, కూటూరు గ్రామానికి చెందిన గుడివాడ గంగాధర్, సున్నం విజయ్‌లు మండలంలోని పలు గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, వీటిని ఆటో ద్వారా ఏపీ రాష్ట్రం చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన అజ్జర్‌కు విక్రయించేందుకు బయల్దేరిన క్రమంలో పట్టుబడ్డారు. ఆటో, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లయిస్ శాఖకు అప్పగించారు.

### భార్య కాపురానికి రావడం లేదని...

## మనస్తాపంతో భర్త ఆత్మహత్య

పాల్వంచ, జూన్ 13: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ములకలపల్లి మండలం పూసుగూడేనికి చెందిన గుగులోతు వెంకటేష్(30)కి మూడేళ్ల క్రితం వివాహమైంది. గత కొన్ని నెలలుగా భర్తతో విభేదించి భార్య పుట్టింట్లోనే ఉంటుంది. దీంతో మనస్తాపానికి గురైన అతడు పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లోని ఓ బారుషాపులో మద్యం సేవించడానికి వెళ్లాడు. తనతో పాటు తెచ్చుకున్న గడ్డి మందును మద్యంలో కలుపుకుని సేవించాడు. దీంతో గమనించిన స్థానికులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకటేష్ తండ్రి దస్రూ స్థానికులతో కలిసి అక్కడకు చేరుకుని అతడిని హుటాహుటిన కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతుడి దస్రూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ బానాల రాము తెలిపారు.

## మానసిక వేదనతో యువకుడి...

పెనుబల్లి, జూన్ 13: మానసిక వేదనతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బయ్యన్నగూడెంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన ఆముదాల శ్రీనివాసరావు(33) మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు అతడిని పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వీఎం బంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మృతదేహాన్ని రహదారిపై ఉంచి..

## ఆందోళన చేసిన 13 మందిపై కేసు నమోదు

కొణిజర్ల, జూన్13: మృతదేహాన్ని రహదారిపై ఉంచి ఆందోళన చేసిన 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంకర్‌రావు గురువారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల ఆయుర్వేద ఆసుపత్రిలో విద్యుత్ మరమ్మతులు చేయటానికి వచ్చి విద్యుదాఘాతానికి గురై నారగాని సతీష్ మృతి చెందిన విషయం విధితమే. కాగా సతీష్ మృతి పై న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధవులు, స్థానికులు మృతదేహంతో ఆయుర్వేద ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. అధికారులు గాని, సంబంధిత వైద్య సిబ్బంది గాని ఎవరూ రావడం లేదని, ఆగ్రహంతో మృతదేహాన్ని తీసుకొని ప్రధాన రోడ్డుపై ఉంచి ఆందోళనకు దిగారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 13 మందిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మరికొంత మందిని ఇంకా గుర్తిస్తున్నామని పేర్కొన్నారు.

# ఊరందరికీ కీళ్ల నొప్పులే..

» తీవ్ర ఇబ్బందులు పడుతున్న బచ్చువారిగూడెం వాసులు » మందులు వాడినా ఫలితం శూన్యం
» ప్రతి ఇంట్లోను బాధితులు » ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలంటూ వేడుకోలు

అశ్వారావుపేట రూరల్, జూన్ 13: మండలంలోని బచ్చువారిగూడెం గ్రామవాసులు గత కొద్ది రోజులుగా కీళ్లు, నరాల నొప్పులతో కదల్లేక, నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కసారిగా చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఒకరి వెంట ఒకరు నొప్పుల బారీన పడ్డారు. ఉదయం మంచం మీద నుంచి కూడా లేవలేని పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటిలోనూ కీళ్ల నొప్పుల బాధితులు ఉన్నారు. ఒక్కసారిగా గ్రామంలో అందరినీ కీళ్ల, మోకాళ్ల నొప్పులు ఇబ్బందులు పెట్టడంతో గ్రామానికి ఏమి అయిందో అంటూ ఆందోళన చెందుతున్నారు.

### దురదలు తీవ్రంగా వేధిస్తున్నాయి..



**అచ్చె రంగారావు, బచ్చువారిగూడెం**

తీవ్రమైన నొప్పితో నడవలేకపోతున్నా.. కీళ్ల నొప్పులతో కాలు అడుగుతీసి అడుగు వేద్దామన్నా సహకరించడం లేదు. పది రోజులుగా తీవ్రమైన నొప్పి వేదిస్తోంది. ఒళ్లు, నరాలు, కీళ్ల నొప్పితో కొందరు మంచాలకే పరిమితమయ్యారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజలను నొప్పుల నుంచి రక్షించాలని వేడుకుంటున్నాం. అధికారులు నొప్పులకు గల కారణాలను గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టాలి.

### 15 రోజులుగా తీవ్రమైన నొప్పులు

మండలంలోని గుమ్మడివల్లి ప్రభుత్వ వైద్యశాలకు కిలోమీటరు దూరంలో ఉన్న బచ్చువారిగూడెంలో దాదాపు 90 కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రతి ఇంటిలోనూ నొప్పుల బాధితులు ఉన్నారు. అనేక మంది ప్రస్తుతం కీళ్లు, మోకాళ్లు, మోచేతి నొప్పులతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొందరికి నొప్పులతో పాటు జ్వరం కూడా వస్తుండటంతో ఇబ్బందులు చెప్పలేకుండా ఉన్నాయి. రోజురోజుకు నొప్పుల బారీన పడుతున్న గ్రామస్థుల సంఖ్య పెరుగుతుందని పేర్కొంటున్నారు.

### పరీక్షలు చేస్తున్నాం...

**● మధులిక, గుమ్మడివల్లి పీహెచ్‌సీ వైద్యురాలు**

కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు కొంతమంది ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందారు. నొప్పుల బారీన పడినవారికి చికెన్‌గన్యా, ఇతర టెస్టులు చేయిస్తున్నాం. మందులు క్రమం తప్పకుండా వాడితే ఇబ్బందులు ఉండవు. నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడతాం.

### కారణం తెలియక ఆందోళన..


కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్న ముత్తమ్మ

కాళ్లు, చేతులు వాయటం, తీవ్రమైన నొప్పులు రావటానికి కారణాలు తెలియక గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకరిద్దరికీ ఏవో కారణాలు ఉంటాయి, కాని దాదాపుగా ఊరంతా ఒకే రకమైన సమస్యతో బాధపడుతుండటంతో కారణాలు ఏమిటా అన్వేషణలో పడ్డారు. వాతావరణంలో మార్పులు అయితే మిగిలిన గ్రామాల్లోనూ వస్తాయని, కాని తమ గ్రామంలోనే తమనే నొప్పులు వేధిస్తుండటం అర్థం కావడం లేదని అభిప్రాయపడుతున్నారు. నొప్పులకు ఆర్‌ఎంపీ వద్ద, ప్రభుత్వ వైద్యశాలలో మందులు వాడినా ఫలితం ఉండటంలేదని తెలిపారు. తమను తీవ్రంగా వేధిస్తున్న ఈసమస్యపై వైద్యశాఖ ప్రత్యేక దృష్టిపెట్టి శిబిరాన్ని ఏర్పాటు చేసి తమను నొప్పుల బారీ నుంచి రక్షించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

### ఖమ్మంలో 19,20 తేదీల్లో

## టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జూన్ 19,20 తేదీల్లో రెండు రోజుల పాటుతెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం బైపాస్ రోడ్ ఉషాహరి కన్వెన్షన్‌లో 19న ఉదయం రాష్ట్ర సమాచార-పౌరసంబంధాలు, రెవెన్యూ గృహనిర్మాణం శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మహాసభలను ప్రారంభిస్తారని, వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా, రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు రాజకీయ, జర్నలిస్టు ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి వర్కింగ్ జర్నలిస్ట్ ప్రతినిధులు మహాసభలకు హాజరై చర్చల్లో పాల్గొంటారని తెలియజేశారు. జూన్20న సాయంత్రం ముగింపుసభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొంటారని పేర్కొన్నారు. జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### పర్ణశాల హుండీ ఆదాయం

## రూ.17.19లక్షలు

దుమ్ముగూడెం, జూన్ 13: భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన మండలంలోని పర్ణశాల రామాలయంలో గురువారం హుండీ లెక్కింపును ఆలయ కమిటీ సభ్యులు చేపట్టారు.. 147 రోజులకు గానూ రూ17,19,292ల నగదు, మూడు మలేషియా రింగెట్స్ లభించాయి. గతంలో 272 రోజులకు రూ.18లక్షల హుండీ ఆదాయం లభించగా, ఈసారి కేవలం 147 రోజులకే ఇంత ఆదాయం లభించడం విశేషం. ఈ కార్యక్రమంలో ఈవో రమాదేవి, సూపరింటెండెంట్ భవాని రామకృష్ణ, ఆలయ ఇన్‌చార్జి అనిల్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తాం

» రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మం రూరల్, జూన్ 13: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలను అతి త్వరలోనే అందజేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం, పెద్దతండా, చిన్నతండా, వరంగల్‌క్రాస్ రోడ్డు తదితర గ్రామాల్లో ప్రజల చెంతకే మీ శీనన్న కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలుగా అందజేస్తామని తెలిపారు. మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ సమస్యలన్నింటి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గడిచిన పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు ఇవ్వలేదని ఆరోపిం చారు. ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని వారి నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. అనంతరం పెద్దతండా పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో వసతులు తదితర సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రేస్ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, బండి జగదీష్, మద్ది మల్లారెడ్డి, సీపీఐ జిల్లా సహయ కార్యదర్శి దండి సురేష్, కిషోర్ నాయక్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు పాఠ్యపుస్తకాల పంపిణీకి బ్రేక్

» బుక్స్ వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖ ఆదేశాలు
» ఖమ్మం జిల్లాలో మొత్తం 92,500 వాపస్

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 13: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ గందరగోళానికి దారి తీసింది. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ఆయా జిల్లాల్లో అధికారులు, ఉపాధ్యాయులు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు వాటితో పాటు వర్క్‌బుక్‌లను కూడా పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే పుస్తకాల్లో ప్రచురణకు సంబంధించి కొత్త వివాదం తలెత్తింది. పుస్తకాల్లోని మొదటి పేజీలో ఉండే ముందుమాట మార్చకుండానే విద్యాశాఖ పుస్తకాలను ముద్రించినట్లుగా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆ విషయం కాస్త వివాదాస్పదం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పుస్తకాల పంపిణీని నిలిపివేసి, ఇప్పటి వరకు పంపిణీ చేసిన పుస్తకాలను కూడా వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖ ఆయా జిల్లాల డీఈవోలకు సమాచారం అందజేసింది. 1 నుంచి 10వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకాల్లో ముందుమాట పేజీలో మాజీ ముఖ్యంత్రి కేసీఆర్, మాజీ విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డితో పాటు పలువురు మాజీ మంత్రులు పేర్లు అధికారుల పేర్లతో ఉన్న పేజీనే మళ్లీ ముద్రించి పంపిణీ నిర్వహించారు. కొన్ని జిల్లాలో ముందుమాట పేజిని తొలిగించి పంపిణీ చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరాలు రావడంతో తెలుగు బుక్స్ తిరిగి వాపస్ తీసుకొని మళ్లీ ముద్రించి పంపిణీ చేయాలని విద్యాశాఖ డీఈఓలకు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 10 తరగతి విద్యార్థులు 92,500 మంది ఉన్నారు. వీరిలో బుధవారం 15 వేల వరకు పంపిణీ చేయగా మిగిలిన పుస్తకాలు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద ఉన్నట్లు తెలిసింది. జిల్లాలోని అన్ని తెలుగు పాఠ్యపుస్తకాలను తిరిగి తీసుకోవాలని ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ గురువారం ఆదేశాలు జారీచేశారు. దీంతో విద్యార్థుల వద్ద ఉన్న పుస్తకాలు, పాఠశాలల్లో ఉన్న పుస్తకాలను తిరిగి గోదాంకు తరలించనున్నారు.

# 186 కేజీల గంజాయి స్వాధీనం

» ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న కొత్తగూడెం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్13: అక్రమంగా తరలిస్తున్న 186 కేజీల గంజాయిని కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్‌ఐ విజయ తన సిబ్బందితో కలిసి బస్టాండ్ సెంటర్ సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ముగ్గురు వ్యక్తులు టీఎస్17 జే4458 అనే నెంబరు గల కారులో అనుమానాస్పదంగా కనిపించారు. కారును ఆపి తనిఖీ చేయగా 93 ప్యాకెట్లలో 186 కేజీల బరువు గల రూ.75 లక్షల విలువ గల నిషేధిత గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులతో కలిసి వన్‌టౌన్ పోలీసులు ఈ గంజాయిని పట్టుకోవడం జరిగిందని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో కామారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు నిందితులు పెనుగొండ నరసింహులు, కుంచం లక్ష్మణ్, భూక్యా లక్ష్మణ్ ఉన్నారని తెలిపారు. పట్టుబడిన ఈ ముగ్గురు నిందితులు ఒరిస్సా రాష్ట్రంలోని మల్కాన్ గిరి అటవీ ప్రాంతంలో కొనుగోలు చేసి మహారాష్ట్రలోని షోలాపూర్ నందు విక్రయించేందుకు నిషేధిత గంజాయిని తీసుకెళ్తుండగా పట్టుకోవడం జరిగిందని వెల్లడించారు. వాహన తనిఖీలలో నిషేధిత గంజాయిని అక్రమంగా తరలించే నిందితులను పట్టుకున్న సీ.సీ.ఎస్, వన్ టౌన్ పోలీసులను జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.

## భద్రాచలంలో 7.3 కేజీల గంజాయి..


గంజాయి నిందితులతో పోలీసులు

భద్రాచలం, జూన్ 13: అక్రమంగా తరలిస్తున్న రూ.5 లక్షల విలువైన గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భద్రాచలంలోని కూనవరం రోడ్డులో పట్టుకున్నారు. ఎస్‌టీఎఫ్ సీఐ సుంకరి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలంలో గురువారం ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జరిపిన ఆకస్మిక తనిఖీల్లో భూపాలపల్లి జిల్లా కాటారానికి చెందిన రేకుల సాయికుమార్, పెద్దపల్లి జిల్లా కొలనూరుకు చెందిన ఏకుల సజన్‌కుమార్‌లు ఒడిశా రాష్ట్రానికి వెళ్లి 7.3 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. యువకులు ఆ గంజాయిని తీసుకొని వస్తుండగా ఎక్సైజ్ అధికారులకు అందిన సమాచారం మేరకు వారిని భద్రాచలంలోని కూనవరం రోడ్డులో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.3 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా స్నేహితుడి వద్ద తీసుకున్న బైక్ విలువ రూ.2 లక్షల మేరకు ఉంటుందని తెలిపారు.

అదే విధంగా మరో కేసులో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 25 లీటర్ల గుడుంబాను పట్టుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో సీఐ సుంకరి రమేష్, వెంకట్, హన్మంతరావు, సుదీర్, బాలు, కరీం, విజయ్ హరీష్, ఎక్సైజ్ సీఐ రహీమున్నీసాబేగం, ఎస్‌ఐలు సీతారామరాజు, సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

### పాత ఇనుప కొట్టులో..

## సింగరేణి ఇనుము

» పట్టుకున్న ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది

మణుగూరుటౌన్, జూన్ 13: మణుగూరు పట్టణంలోని ఓ పాత ఇనుప కొట్టులో సింగరేణి సంస్థకు చెందిన ఇనుము లభ్యమైంది. సింగరేణి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు మండలంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పాత ఇనుము దుఖాణాదారులు సింగరేణి సంస్థతో పాటు బీటీబీపీఎస్‌కు చెందిన పాత ఇనుము కొనుగోలు చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు పెద్దఎత్తునే ఉన్నాయి. ఇందులో భాగంగా సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు బుధవారం రాత్రి టీడీపీ సెంటర్ నుంచి చినరాయిగూడెం వెళ్లే దారిలోని 220 కేవీ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న ఓ పాత ఇనుప కొట్టును తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సదరు షాపులో సింగరేణి సంబంధించిన పాత ఇనుము లభించింది. ఈ విషయమై సింగరేణి సెక్యూరిటీ ఆఫీసర్ షబ్బీరుద్దీన్‌ను వివరణ కోరగా..పాత ఇనుమును స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టారు.


ఇనుమును స్వాధీనం చేసుకుంటున్న సింగరేణి సిబ్బంది

## భార్య గొంతుకోసి పరారైన భర్త..

● సత్తుపల్లిలో ఘటన

సత్తుపల్లిరూరల్, జూన్13: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త కత్తితో దాడిచేసి పరారైన సంఘటన సత్తుపల్లి పట్టణంలోని వెంకటేశ్వర టాకీస్ రోడ్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లిలో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్న రాయపురపు సురేష్ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయాగా పనిచేస్తున్న తన భార్య ప్రమీల మధ్య కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంటిలో వారి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, సురేష్ భార్య గొంతుకోసి పరారైనట్లు బంధువులు తెలిపారు. గాయపడిన బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గురువారం రాత్రి వరకు తమకు బాధితురాలి నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తా...

● ఒకరు మృతి, 10 మందికి గాయాలు


మడివి బండి మృతదేహం


పాల్వంచ, జూన్ 13: అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో పది మంది గాయపడిన సంఘటన మండల పరిధిలోని మొండికట్ట గ్రామశివారులో గురువారం చోటు చేసుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 16 మంది గురువారం అశ్వాపల్లి మండలం సింగారంలోని ఓ వివాహ వేడుకలకు హాజరయ్యారు. ఆ కార్యక్రమం పూర్తి చేసుకుని స్వరాష్ట్రానికి తిరిగి వెళ్తుండగా, మండలంలోని మొండికట్ట గ్రామశివారులోని మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి లోయలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మడివి బండి(35) తీవ్రంగా గాయపడింది. ఆమెతో పాటు మరో 10 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులందరినీ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మడివి బండిని పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ముప్వ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఈ ప్రమాదంపై బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేయాల్సి ఉందని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

# మళ్లీ దొరికిన కలప

» వద్దిపేట అడవుల్లో తనిఖీలు » నాలుగు ట్రాక్టర్ల టేకు స్వాధీనం

చర్ల, జూన్ 13: చర్ల మండలం వద్దిపేట గ్రామంలో గురువారం మరోసారి కలపను ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. వద్దిపేట గ్రామం నుంచి లారీలో తరలిస్తున్న టేకు కలపను చర్ల అటవీశాఖ పట్టుకున్న విషయం తెలిసిందే. దీంతో చర్ల రేంజ్ అధికారి ఉపేందర్ విచారణ చేపట్టారు. లారీ డ్రైవర్‌ను గ్రామానికి తీసుకుని వెళ్లి వివరాలు సేకరించారు. అతను ఇచ్చిన సమాచారం ప్రకారం అధికారులు వివరాలు సేకరించారు. దీంతో అక్రమంగా దాచి పెట్టిన భారీ టేకు కలప పట్టుబడుతోంది. గురువారం ఉదయం వద్దిపేట వెళ్లిన చర్ల రేంజ్ అధికారి సమీప అడవుల్లో గాలించారు. అడవుల్లో వివిధ చోట్ల దాచి ఉంచిన భారీ టేకు దిమ్మెలు పట్టుబడ్డాయి. ఒక్కో టేకు మోద్దు భారీ ఆకారంలో ఉన్నాయి. మొద్దులను చూసిన అధికారు లు ఆశ్చర్యానికి లోనయ్యారు. అనంతరం టేకు మోద్దులను నాలుగు ట్రాక్టర్లలో చర్ల అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కలప విలువ సుమారు రూ.5 లక్షలు పైగా ఉంటుందని రేంజ్ అధికారి ఉపేందర్ తెలిపారు. ఈ టేకు మొద్దులు అన్నీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొత్తపల్లి, బీమారం, ఆవుపల్లి, పూజారికాంకేర్ నుంచి తీసుకొచ్చి ఇక్కడ దాచి పెట్టినట్లు విచారణలో తేలిందన్నారు. ఇక్కడ వాటిని కోసి ఇతర ప్రాంతాలను తరలిస్తున్నారని తెలిపారు. కాగా మూడు రోజుల్లో రూ. 12 లక్షల విలువైన టేకు కలప పట్టుబడ్డంతో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాశమైంది. కాగా మండల వ్యాప్తంగా టేకు కలప అక్రమ రవాణా అవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది అటవీశాఖ సిబ్బంది అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు అక్రమ కలప రవాణాపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


వద్దిపేట అడవుల్లో పట్టుబడ్డ కలప



## సత్తుపల్లి పట్టణాభివృద్ధికి రూ.46లక్షల నిధులు



సత్తుపల్లిరూరల్, జూన్13: సత్తుపల్లి మునిసిపాలిటీలో ఆయా వార్డుల అభివృద్ధికి రూ.46లక్షలు నిధులు కేటాయించినట్లు మునిసిపల్ ఛైర్‌పర్సన్ కూసంపూడి మహేష్ తెలిపారు. గురువారం సత్తుపల్లి మునిసిపాలిటీలో 41వ సాధారణ సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని 23 వార్డులకు గానూ ఒక్కోవార్డు రూ.2లక్షల చొప్పున నిధులను అభివృద్ధి కౌన్సిల్‌లో తీర్మానించారు. పారిశుధ్యం, నీటి సరఫరా, ఎలక్ట్రికల్ విభాగాలలో నెలకొన్న సమస్యలు, వీధులలో కుక్కల స్వైరవిహారం తదితర వాటిపై చర్చించారు. రూ.46లక్షలను డ్రెయిన్లు, నీటిసరఫరా కోసం తీర్మానించనున్నట్లు మునిసిపల్ కమీషనర్ మందా రవిబాబు చెప్పారు.

# మధిరలో భారీ వర్షం

- విరిగి పడ్డ చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు..
- మధిర, ఎర్రుపాలెం మండలాలకు నిలిచిన విద్యుత్ సరఫరా
- విద్యుత్ శాఖకు భారీ నష్టం

మధిర, జూన్13: మధిరలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రోడ్లపై రెండు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహించింది. గాలి దుమారంకారణంగా మధిరలోని ఒన్‌టౌన్‌లో పలు రోడ్లల్లో ఉన్న చెట్ల కొమ్మలు కరెంటు తీగల మీద విరిగి పడ్డాయి. కరెంటు స్తంభాలు సైతం అనేక రోడ్లలో విరిగి పడ్డాయి. వర్షం కారణంగా జనం ఎవరూ బైటకు రాకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. ప్రాథమిక అంచనాల ప్రకారం 20కి పైగా స్తంభాలు పడిపోయినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఇంకా గ్రామాల్లో జరిగిన నష్టంపై సమాచారం రావాల్సివుందని తెలిపారు. వర్షం కారణంగా మధిర 133కేవీ సబ్ స్టేషన్‌కు వచ్చే కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో మధిర, ఎర్రుపాలెం మండలాలకు విద్యుత్ సరఫరా బంద్ అయింది. ప్రధానంగా వన్‌టౌన్‌లోని వర్తకసంఘం రోడ్డులోనే ఐదు స్తంభాలు విరిగి పడ్డాయి. సాయిబాబా దేవాలయంరోడ్డు, ఆజాద్ రోడ్డు, ముస్లింబజార్, గూడెల్లి నగర్, శివాలయం రోడ్డులలో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. బ్రాహ్మణబజార్‌లో విద్యుత్ తీగెలు తెగిపడ్డాయి. ఇంకా పలు ప్రాంతాల్లో కరెంట్ తీగెలపై చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి.

### విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు : ఏడీఈ

గాలిదుమారం వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగిపడటం, స్తంభాలు పడిపోవడం వల్ల మధిర, ఎర్రుపాలెం మండలాలు కరెంట్ సరఫరా నిలిపి వేశాము. ఎక్కడా ఎలాంటి ప్రమాదం జరగలేదు. నష్టంపై పూర్తి సమాచారం రావాల్సి ఉంది. సిబ్బంది యుద్ధప్రాతికన కరెంట్ స్తంభాలు తొలగించారు. టుటౌన్‌లో సాయంత్రం 7.30కు కరెంట్ పునరుద్ధరించాం. వన్‌టౌన్ ప్రాంతానికి కొంతసమయం పడుతుంది. రూరల్‌లోనూ, ఎర్రుపాలెం మండలానికి కరెంట్ పునరుద్ధరించేందుకు మరమ్మత్తులు చేస్తున్నాం. అర్ధరాత్రివరకు పునరుద్ధరిస్తాం.



మధిర ప్రధాన రోడ్లపై వరదనీరు, చనిపోయిన గేదెలు, విద్యుత్ స్తంభాలను సరిజేస్తున్న అధికారులు

### మోటమర్రిలో పిడుగుపాటుకు వ్యక్తి మృతి

బోనకల్: మండలంలోని మోటమర్రిలో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గీతకార్మికుడు మృతి చెందాడు. వివరాల్లో వెళ్తే గ్రామానికి చెందిన చిట్టుమోదు విష్ణు(42) గీత కార్మిక వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వృత్తిలో భాగంగా కల్లు గీత కోసం తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో పాటు దగ్గరలో పిడుగు పడటంతో దాని దాటికి చెట్టుపై ఉన్న విష్ణు కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆళ్లపాడు నుంచి బోనకల్ వైపుకు వచ్చే రహదారి మార్గంలో చెట్టు పడటంతో రాకపోకలు నిలిచి పోయాయి.

### పిడుగు పడి రెండు పాడిగేదెల మృత్యువాత

మధిరరూరల్: సిరిపురం గ్రామంలో రైతులైన నంబూరి శ్రీనివాసరావు, గోసు నారాయణకు చెందిన రెండు పాడిగేదెలు గ్రామశివారులోని పొలాలకు మేత మేసేందుకు వెళ్లాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో గేదెలు మేత మేస్తుండగా పిడుగు పడింది. గేదెలపై పిడుగు పడి అక్కడికక్కడే మృతిచెందాయి.

# ఏన్కూరులో సీతారామ పనుల పరిశీలన

ఏన్కూరు, జూన్13: సీతారామ ఏన్కూరు లింక్ కెనాల్ పనులను మంత్రులు పరిశీలించారు. గురువారం ఏన్కూరు వద్ద జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు పనులను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి మంత్రి తుమ్మల పరిశీలించారు. సీతారామా ప్రధాన కాలవకు అక్కడకకడక్కడ ఇబ్బందిగా ఉన్న అటవీశాఖ అనుమతులను త్వరలోనే తీసుకుంటామని చెప్పారు. ఈఏడాదే పూర్తిస్థాయిలో సీతారామ ప్రాజెక్టు పూర్తిచేయించి ఉమ్మడి ఖమ్మంజిల్లాను సస్యశ్యామలం చేస్తాననిహామీ ఇచ్చారు. లింక్‌కెనాల్ పనులనువర్షలు పడకముందే పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీఎమ్మెల్సీపోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగులు సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరావు, బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ ఛైర్మన్ జయపాల్, గుత్తా వెంకటేశ్వరరావు, ఏన్కూరు, వైరా మండల అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, స్వర్ణ నరేంద్ర కుమార్, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, లేళ్ల వెంకటరెడ్డి, వేముల కృష్ణప్రసాద్, ఎంపీపీ వరలక్ష్మి పాల్గొన్నారు.



భూనిర్వాసితులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

### భూనిర్వాసితుల ఆందోళన

ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా జరిగే పనులను తక్షణమే ఆపాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఉపముఖ్యమంత్రి భట్టి కాన్వాయ్‌ను అడ్డుకుని కొద్దిసేపు ఆందోళన చేశారు. మెరుగైన నష్టపరిహారం ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

# 'కృష్ణప్రసాద్' పాఠశాలలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంక్రైం,జూన్13: ఖమ్మం పోలీసుశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో పలు ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులలను ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ఛైర్‌పర్సన్ నిశితాశర్మ గురువారం ఒకప్రకటనలో తెలిపారు హైస్కూల్ బయాలజీ, ప్రీప్రైమరీ, ప్రైమరీటీచర్ సబ్జెక్టులు బోధించేందుకు ఏదైనా డిగ్రీ బీఈడీ చేసినవారు అర్హులన్నారు. ప్రైమరీ కంప్యూటర్ టీచర్ బోధించేందుకు ఏదైనా డిగ్రీలో కంప్యూటర్‌లో ఒక సబ్జెక్టుగా కలిగి వారు ఈనెల17లోగా దరఖాస్తులను కేపీఎంహెచ్ఎస్‌కెఎంఎం రేటాఫ్ జీమెయిల్.కాం ద్వారా పంపాలని ఆ ప్రకటనలో తెలిపారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కూసుమంచి, జూన్13:: ఎరువులు, విత్తనాలు రైతాంగానికి అధిక ధరలకు విక్రయిస్తే విత్తన చట్టం, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల తెలిపారు. గురువారం కూసుమంచి, నాయకన్‌గూడెం గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. డీఏవో వెంట ఏడీఏ విజయచంద్ర, ఏవో వాణి తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: నకిలీ విత్తనాలను రైతులకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకుడు విజయచంద్ర హెచ్చరించారు. గురువారం ఏడీఏ, మండల వ్యవసాయాధికారితో కలిసి మండలంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేసారు. విత్తన స్టాకు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విత్తన నిల్వలకు సంబంధించిన స్టాకు బోర్డులను షాపుల్లో ఉంచిందీ లేనిదీ పరిశీలించారు. ఏడీఏ వెంట మండల వ్యవసాయాధికారిణి అరుణకుమారి ఉన్నారు.

ఏన్కూరు: ఏన్కూరులోని విత్తన దుకాణాలను జిల్లా వ్యవసాయఅధికారివిజయనిర్మల గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విత్తనాలు అమ్మే వారిపై చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు కరుణశ్రీ, మండల వ్యవసాయాధికారి నరసింహారావు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు బాలకృష్ణ, లహరి పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

తిరుమలాయపాలెం,జూన్13:పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పగిడికత్తుల రాందాస్ డిమాండ్ చేశారు. గురువారం ఎంపీవో రాజేశ్వరికి వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్మికులకు ఆరునెలల నుంచి వేతనాలు లేవని, జిల్లా కలెక్టర్ స్పెషల్ ఫండ్ నుంచి వారికి వేతనాలు ఇవ్వాలని కోరారు. ఉదయం వెట్టిచాకిరి పంచాయతీ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని, బీమా సౌకర్యం కలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు గోసు పుల్లయ్య, మీగడ సైదులు, కత్తుల బిక్షం, యల్లయ్య, కె.రవి పాల్గొన్నారు.

# దుర్గంధం భరించలేం

- మర్రిబావిని శుభ్రం చేయండి
- 25వ డివిజన్‌లో స్థానికుల ఆందోళన

ఖమ్మంకార్పొరేషన్, జూన్13:నగరంలోని 25వ డివిజన్ కుమ్మరి బజార్ మర్రిచెట్టు సెంటర్ వద్దనున్న పురాతనమైన మర్రిబావిలో వ్యర్థాలను తొలగించాలని గురువారం స్థానికులు మర్రిబావి వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రాచీనమైన ఈ బావిలో చెత్తాచెదారం వ్యర్థాలు పేరుకుపోవటంతో విపరీతమైన దుర్గంధం వస్తోంది. ఇబ్బందులకు గురవుతూ అనారోగ్యం బారిన పడుతున్నామని స్థానికులు పేర్కొన్నారు. గత వర్షాకాలంలో ఈప్రాంతంలోనే డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలాయని, పలువురు దోమకాటుతో బోదకాలు వ్యాధితో బాధపడుతున్నారని స్థానికులు పేర్కొంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి, మర్రిబావిని శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న స్థానికుల, 25వ డివిజన్‌లోని మర్రిబావిలో పేరుకుపోయిన వ్యర్థాల

# ఆశా కార్యకర్తలకు పరీక్షల విధానం సరికాదు

- కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తలు నిరసన

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్13: ఆశా కార్యకర్తలకు పరీక్షలు పెడ్తామని వివరాలు సేకరించటం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్యాణం వెంకటేశ్వరరావు విమర్శించారు.ఆశాకార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఫిక్స్‌డ్ వేతనం అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం సమీకృత కలెక్టరేట్ ఎదుట జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఆశకార్యకర్తలు నిరసన తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రతీనెల 2న వేతనాలు చెల్లించగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో 13న చెల్లిస్తున్నారని ఆరోపించారు. పలు డిమాండ్‌లతో జిల్లా అధికారులకు వినతిపత్రం అందించారు. నాయకులు విష్ణు, ఎస్ నవీన్‌రెడ్డి, రమ్య, మోహన్‌రావు, బీ అమల, రమణ, రాణి, కమల, సరోజిని పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

# పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం

- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి
- పలు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు పంపిణీ

సత్తుపల్లి,జూన్13: సత్తుపల్లి పట్టణంలోని పాత సెంటర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రతి ఏడాది వలే రూ.25వేలను ఈసారి కేటాస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి తెలిపారు. గురువారం సత్తుపల్లి పట్టణంలోని పాతసెంటర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జయశంకర్ బడిబాట కార్యక్రమంలో విద్యార్థులకు యూనిఫామ్, నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మెరిట్ స్కాలర్‌షిప్స్ తెచ్చుకున్న విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంఈవో బీ.రాములు, హెచ్ఎం శైలకుమారి, డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నరసింహారావు,గాదె చెన్నారావు, మొరిశెట్టి సాంబశివరావు, ఎండీ.కమల్‌పాషా, తోట సుజలరాణి, మందపాటి పద్మజ్యోతి పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

### ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

పెనుబల్లి: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గురువారం మండలంలోని లంకపల్లి, వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలతోపాటు టేకులపల్లి ఆదర్శ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మట్టా దయానంద్, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఎంఈవో సీహెచ్. వెంకటేశ్వరరావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

### పాఠ్యపుస్తకాలు పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడుతండాలో గురువారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను ఎంపీపీ మంగిలాల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని వసతులున్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శేషాద్రి, ఎంఈవో రామాచారి, ఎంపీటీసీ పాపానాయక్, హెచ్ఎం రజనీ, దేవేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఖమ్మంకార్పొరేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సారథినగర్‌లో జూబ్లీపుర ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఏకరూపదుస్తులు, పాఠ్యపుస్తకాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నీరజ కుమారి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎల్ఎల్ఎం ఎంట్రన్స్‌లో జిల్లావాసికి 209 కు ర్యాంక్



ఖమ్మంఖానాపురంహవేలి,జూన్13: రాష్ట్రఉన్నత విద్యామండలి గురువారం ప్రకటించిన ఎల్ఎల్ఎం ఎంట్రన్స్ ఫలితాల్లో ఖమ్మం నగరానికి చెందిన యువ న్యాయవాది నాళ్ల భానుచందర్ రాష్ట్రస్థాయిలో 209ర్యాంక్ సాధించాడు. భానుచందర్‌కు హైదరాబాద్‌లోని ఉస్మానియ యూనివర్సిటీ పరిధిలోని లాకళాశాలలో ఎల్ఎల్ఎం. సీటు లభించే అవకాశం ఉంది. ఇల్లందు మండలం, మాణిక్యారానికి చెందిన ఆయన ప్రస్తుతం జిల్లా న్యాయస్థానంలో న్యాయవాదిగా పని చేస్తున్నాడు.

## రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

నేలకొండపల్లి,జూన్13: మండల పరిధిలోని మూటాపురం వద్ద కారు చెట్టుకు ఢీకొన్న సంఘటనలో కారును నడుపుతున్న సుర్దేపల్లి గ్రామానికి చెందిన పంబా ఉదయ్‌కిరణ్ గాయపడ్డాడు. మూటాపురం వీరన్న స్వామి గుడి నుంచి వస్తున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. మరో ఘటనలో రాయగూడెం సమీపంలో టిప్పర్ బోల్తా కొట్టిన సంఘటనలో డ్రైవర్ గోపి తీవ్రంగా గాయపడ్డాడు. నేలకొండపల్లిలోని ఓగ్రానైట్ క్వారీ నుంచి వేస్ట్ రాళ్ళను పెనుగంచిప్రోలుకు తోలుతున్నారు. ఈక్రమంలో గురువారం రాత్రి రాయగూడెం మూలమలుపు వద్ద అదుపు టిప్పర్ తప్పి బోల్తా కొట్టింది. గోపి తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి.

## సరస్వతిదేవి విగ్రహావిష్కరణ

కారేపల్లి, జూన్13: మండల పరిధిలోని గాంధీనగరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సరస్వతి దేవివిగ్రహాన్ని ఎంఈవో ఎం.జయరాజ్ గురువారం అవిష్కరించారు. ప్రధానోపా ధ్యాయురాలు శారద, వెంకటేశ్వర్ల దంపతుల కుమారుడు, రాహుల్, కుమార్తె సుష్మ సహకారంతో ఈవిగ్రహన్ని ఏర్పాటు చేశారు. పదో తరగతిలో మండల ప్రథమ స్థాయిలో 9.8 జీపీసాధించిన జి.వినయ్‌కుమార్‌ను ఎంఈవో సన్మానించారు.

## ఆలయానికి మైక్‌సెట్ వితరణ

కారేపల్లి జూన్13: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయానికి మండల కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త చిరునోముల మాధవ్ గురువారం మైక్‌సెట్‌ను వితరణ అందచేశారు. గురువారం ఆలయంలో ఆలయపూజారి నాగశాయిశర్మకు అందచేశారు.

## నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

తల్లాడ, జూన్13: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నారాయణపురంలో వృద్ధ మహిళలకు సరుకులు పంపిణీ చేశారు. రెడ్డెం ఉమామహేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వీటిని పంపిణీ చేశారు. అనారోగ్యంగా ఉన్న తడికమళ్ల నర్సింహారావు కుమార్తె వైద్యఖర్చుల కోసం రూ.ఐదువేలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకట నారాయణరెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి కర్నాటి లక్ష్మారెడ్డి, కార్యదర్శి నంబూరి కనకదుర్గాప్రసాద్,నిర్వాహకులుబెల్లంకొండ ఆంజనేయులు, శీలం వెంకట రెడ్డి, కటికి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేడుకల బ్రోచర్ ఆవిష్కరణ

ఖమ్మంసాంస్కృతికం,జూన్13: నగరంలోని పంపిగ్ వెల్ రోడ్‌లోని శ్రీకృష్ణసాయి ఆశ్రమంలో 24వ గురుపౌర్ణమి వేడుకల బ్రోచర్‌ను గురువారం ఆశ్రమంలో ఆవిష్కరించారు. వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21 వరకు నిత్యం ఆలయంలో విశేష పూజలతోపాటు సాయి దీక్షలు, మాలధారణ 21న మహా అన్నదాన కార్యక్రమం, నిర్వహిస్తామని ఆలయ ఛైర్మన్ లగడపాటి రామారావు, జనరల్ సెక్రటరీ సిద్ధం శెట్టి నాగమణి తెలిపారు.

## నీట్ ర్యాంకర్ భగత్‌కు సన్మానం



వైరా, జూన్13: జాతీయ మెడికల్ ప్రవేశ పరీక్ష(నీట్)లో మంచి మార్కులు సాధించిన బొంతు భగత్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అభినందించి సన్మానించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, మాజీ ఎంపీపీ బొంతు సమతల కుమారుడైన భగత్ 595మార్కులు సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ, వైరా పట్టణ, మండల, కొణిజర్ల మండల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు పాల్గొన్నారు.

## నేత్రదానం

వైరా, జూన్13: వైరా మునిసిపాలిటీ 13వ వార్డులో గురువారం అనారోగ్యంతో మృతిచెందిన కొదుమూరి అప్పారావు నేత్రాలను దానం చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధుల విన్నపంతో ఈ కుటుంబసభ్యులు అప్పారావు నేత్రాలను దానం చేశారు. వైరా మునిసిపల్ వైస్‌ఛైర్మన్ ముళ్లపాటి సీతరాములు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్ రావు, కౌన్సిలర్ వనమా విశ్వేశ్వరరావు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష లీకేజీ విచారణ జరపాలి

ఖమ్మంఖానాపురంహవేలి జూన్13: నీట్ పరీక్ష లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వ సమగ్ర విచారణ జరపాలని డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్ రాయల సతీష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్లో వద్దా గల డాక్టర్స్ మెడికల్ అకాడమీలో విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. 1563మంది గ్రేస్ మార్కుల విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణను స్వాగతిస్తూ బాణసంచ కాల్చి హర్షం వ్యక్తం చేశారు.

## పాలవాడలో ఎన్‌సీడీ క్యాంప్

సత్తుపల్లిరూరల్,జూన్13: ప్రతీ వ్యక్తిని వారి ఇంటి వద్ద పరీక్షలు జరిపి ఆరోగ్య సమాచారాన్ని అందించే ఎన్‌సీడీ క్యాంప్‌ను గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం సత్తుపల్లి పాలవాడ ఏరియాలో నిర్వహించారు. వైద్యులు ఏ.అవినాష్, నవ్యశ్రీ రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు తాయమ్మ, కృష్ణవేణి, దాసరి శ్రీనివాస్, ఆశా వర్కర్లు మణి, పీరాబీ, దేవీ, సుజాత పాల్గొన్నారు.

## ముజ్జుగూడెం పంచాయతీకి ఫ్రీజర్ వితరణ



ఫ్రీజర్‌ను వితరణ చేస్తున్న దాతలు, గ్రామ పెద్దలు

నేలకొండపల్లి,జూన్13:మండల పరిధిలోని మండ్రాజుపల్లి గ్రామానికి చెందిన సెల్లూరి జనార్ధన్‌రావు-కస్తూరి దంపతులు, కస్తూరి తల్లిదండ్రులు నున్నా రామయ్య-నర్సమ్మల జ్ఞాపకార్థం రూ.లక్ష విలువైన ఫ్రీజర్‌ను ముజ్జుగూడెం గ్రామ పంచాయతీకి గురువారం అందచేసారు. ముజ్జుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల నాయకుడు వేగినాటి లక్ష్మీనర్సయ్య సూచన మేరకు ఫ్రీజర్‌ను గ్రామ పంచాయతీకి అందచేసినట్లు దాతలు తెలిపారు. ఫ్రీజర్‌ను అందచేసిన జనార్ధన్‌కస్తూరి దంపతులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో దాతలతో పాటు వేగినాటి లక్ష్మీనర్సయ్య, సిరికొండ వెంకటేశ్వర్లు, తన్నీరు నారయ్య, గంధం నాగరాజు, నాగేంద్ర, ఉపేందర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, బొడ్డు చిన్ని పాల్గొన్నారు.

# గాంధీనగరం- గాదెపాడు రహదారి పూర్తి

కారేపల్లి, జూన్13: మండల పరిధిలోని గాంధీనగరం-గాదెపాడు గ్రామల మధ్యన గల చెరువుకట్టపై బీటీ రోడ్డు నిర్మాణం గురువారంతో పూర్తిఅయ్యియి. స్థానికుల విన్నపం మేరకు 2012లో ఐటీడీఏ అధికారులు రూ.50లక్షలు మంజూరు చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నిర్మాణ వ్యయం ఎక్కువ కావటంతో మరోపదిలక్షల నిధులు మంజూరు చేశారు. బ్రిడ్జిపనులు పూర్తిచేయించారు. కానీ బీటీ రోడ్డు మంజూరు కాలేదు. గతేడాది సామాజివేత్తం రాంమూర్తి కృషితో ఐటీడీఏ రూ.రెండు కోట్లు మంజూరు చేసింది. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభం చేసేసమయంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ రోడ్డు పనులు పూర్తిచేశాడు. దీంతో దశాబ్దాల కలనేరవేరింది. ఈమార్గంలో ప్రయాణంతో దూరం దగ్గరయింది. దశాబ్దాల కల నెరవేరటంతో రాంమూర్తిని పలువురు అభినందిస్తున్నారు.



నిర్మాణం పూర్తి చేసుకున్న బీటీరోడ్డు

## 20,21తేదీల్లో గిరిజన సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

వైరా, జూన్13: వైరాలో ఈనెల 20,21తేదీల్లో గిరిజన సంఘం రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఆసంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలిపారు. గురువారం వైరాలోని బోడేపూడి భవన్‌లో జరిగిన గిరిజన సంఘం సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. వీటిని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. శిక్షణ తరగతుల విజయవంతానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు భూక్యా కృష్ణనాయక్, బాణోతు హరిచంద్, కృష్ణకాంత్, రాములు, రమేష్ పాల్గొన్నారు.

# రామిశెట్టి కుటుంబానికి మువ్వా, సండ్ర పరామర్శ

సత్తుపల్లిరూరల్, జూన్13: సత్తుపల్లి పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పలు కుటుంబాలను గురువారం టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు పరామర్శించారు. స్థానిక రాజీవ్‌రోడ్‌లో రామిశెట్టి సుబ్బారావు సతీమణి లక్ష్మీసరోజిని అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. జలగం నగర్‌లోని హసావత్ లక్ష్మీ కుటుంబాలను పరామర్శించి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు మట్టా ప్రసాద్, దొడ్డా అమ్ములు, కిషోర్, మిద్దే రామకృష్ణ, కాల్నేని రాజేష్, సాయి, నాగరాజు, భాస్కర్, దిలీప్ తదితరులున్నారు. పట్టణానికి చెందిన మున్నూరు కాపు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రామిశెట్టి సుబ్బారావు సతీమణి లక్ష్మీ సరోజిని అనారోగ్యంతో మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, నాయకులు కొత్తూరు ఉమా మహేశ్వరరావు, అంకంరాజు, అద్దంకి అనిల్, దేవళ్ల శ్రీను, గుంజా వెంకటేశ్వరరావు తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర